క్లుప్తంగా

రైతులు విద్యుత్ మరమ్మతు చేయొద్దు


పొలంబాటలో పాల్గొన్న అధికారులు

మానకొండూర్: పొలాల దగ్గర విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు రైతులు మరమ్మతులు చేయొద్దని, అధికారులకు ఫిర్యాదు చేయాలని టెక్నికల్ డీఈ కె. ఉపేందర్ అన్నారు. శుక్రవారం పోచంపల్లిలో పొలంబాటలో పాల్గొని మాట్లాడారు. రైతులతో కలిసి గ్రామంలో తిరిగారు. రైతులు ధికారికంగా కరెంట్ కనెక్షన్ తీసుకోవాలన్నారు. కెపాసిటర్లను వినియోగించుకుంటే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. తడి చేతులతో స్టాటర్ బాక్సులను ముట్టుకోవద్దని, సాధ్యమైనంతవరకు ప్లాస్టిక్ స్టాటర్ బాక్సులనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో కమర్షియల్ ఏఈ రమేశ్, ఏఈ ఆర్. సత్యనారాయణ, సిబ్బంది రాజిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బస్ చార్జీలను తగ్గించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు


హుజూరాబాద్: పెంచిన విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని ఏబీవీపీ నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలోని అధికారికి వినతిపత్రం సమర్పించారు. విద్యా సంవత్సరం ఆరంభంలోనే బస్సు చార్జీలను పెంచి పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులపై భారం మోపారని, విద్యార్థులకు సరిపడా బస్సులు లేక అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వం విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజ్‌కుమార్, వినయ్, రాకేష్, తేజ, శేఖర్ ఉన్నారు.

దమ్మక్కపేటలో ప్రత్యేక పారిశుధ్య పనులు


కార్మికులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేట గ్రామంలో శుక్రవారం వందరోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించినట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఆయా కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా గడ్డి మొక్కలను, చెత్తా, చెదారాన్ని తొలగించామన్నారు. మురుగుకాలువలను శుభ్రం చేయటంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు వార్డు కార్యాలయ ఆవరణలో ఆరోగ్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు భూపాల్‌రెడ్డి, రాజమోహన్, నవీన్‌కుమార్, సాంబరాజు, శ్రీకాంత్, రవీందర్, రాజయ్య, వినయ్ తదితరులు ఉన్నారు.

డీటీఎఫ్ నాయకుల వినతి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చొప్పదండి: గతేడాది వేసవి సెలవుల్లో పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈవో మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌ను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యార్థుల ప్రగతికి డీటీఎఫ్ చేసే కృషికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌లు రాజమౌళి, అంజయ్య, జిల్లా కౌన్సిలర్‌లు శ్రీనివాస్, శ్రీకాంత్, ఎండీ షరీఫ్, వీరేశం, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప సభ కోసం ఏర్పాట్లు పరిశీలన

కరీంనగర్‌టౌన్: నరేంద్రమోదీ 11 ఏళ్ల సుపరిపాలన, సంకల్ప సాకారంలో భాగంగా శనివారం కరీంనగర్‌లోని వివేకానంద చౌక్‌లో (శివ టాకీస్ దగ్గర) పశ్చిమ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంకల్ప సభ ఏర్పాట్లను బీజేపీ నాయకులు శుక్రవారం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, సంకల్ప సభ కన్వీనర్ ఎన్నం ప్రకాశ్, కో కన్వీనర్‌లు రాపర్తి ప్రసాద్, కొండం సతీశ్, శానగొండ శ్రీనివాస్ (వాసు), రెడ్డెడ్డి శ్రీనివాస్ (బాలు) పాల్గొన్నారు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం


ఇల్లందకుంట: అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎంఈవో


గన్నేరువరం: పారువెల్లలో..


చిగురుమామిడి: రామంచలో..

ఇల్లందకుంట: మండలంలోని రాచపల్లిలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని మండల విద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఇంటింటికి వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని నాణ్యమైన విద్య అందజేస్తామని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోచదువుకున్నవారు ఉన్నత పదవుల్లో ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలు, కంప్యూటర్, ఆత్మరక్షణకు కరాటే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నతాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పల్లె మల్లారెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌చారి,రమాదేవి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ఇల్లందకుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో విద్యార్థులతో మండల విద్యాధికారి కె. రాములు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, ఉచిత యూనిఫాం అందించడం జరుగుతుందన్నారు. హెచ్‌ఎం కే.గోపి, ఉపాధ్యాయులు వరలక్ష్మి, సంపత్, వీరస్వామి, సతీష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో హుజూరాబాద్ ప్రాజెక్టు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సెక్టర్ సూపర్‌వైజర్ జి. రమాదేవి హాజరై మాట్లాడారు. మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో బడిబాట నిర్వహించారు. అనంతరం మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. హెచ్‌ం ప్రశాంత్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని బడిబాట జిల్లా పరిశీలకులు జైపాల్‌రెడ్డి, స్వదేశ్‌కుమార్, నాగేశ్వర్‌రావు కోరారు. శుక్రవారం చిన్నములకనూర్‌లో ప్రాథమిక పాఠశాల, సుందరగిరి, రామంచ గ్రామాల్లో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను సందర్శించారు. కొత్తగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. ఎంఈవో విద్యాధికారి పావని, హెచ్‌ఎంలు శారద, ఆనంద్, శివరాం, టీచర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

గన్నేరువరం: ప్రభుత్వ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, పిల్లల సంఖ్యను పెంచాలని ఎంఈవో రామయ్య తెలిపారు. పారువెల్ల ప్రభుత్వ ప్రాథమకోన్నత పాఠశాలను సందర్శించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం విజయ్‌పాల్‌రెడ్డి, ఏఏపీసీ చైర్మన్ కవిత, టీచర్లు భాగ్యలక్ష్మి, ఇఫ్తాకర్, అలీ, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్, మహేష్, అంగన్‌వాడీ టీచర్ ప్రేమలత పాల్గొన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట


హుజూరాబాద్: మాట్లాడుతున్న ధనలక్ష్మి


గంగాధర: మాట్లాడుతున్న సీడీపీవో

హుజూరాబాద్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరోగ్యలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్ పర్సన్ ధనలక్ష్మి అన్నారు. మున్సిపల్ పరిధి బోర్నపల్లి అంగన్వాడీ సెంటర్‌లో శుక్రవారం అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముర్రుపాలు, తల్లిపాల ప్రాముఖ్యత, బాల కార్మిక నిరోధక చట్టాలు, తదితర అంశాలు వివరించారు. అన్నిరంగాల్లో మహిళలు ముందుకు వెళ్లాలని, ఆర్థిక సాధికారత సాధించాలని పిలుపునిచ్చారు. ఏఎన్‌ఎం, ఆశలు గర్భిణులు బాలింతలు, పిల్లల విషయంలో జాగ్రత్త వహించాలని, లోపపోషణ పిల్లలకు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించాలని తెలియజేశారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ ఇరుసమ్ నాగరాజు, బాలల పరిరక్షణ కేంద్రం జిల్లా అధికారి పర్వీన్, జిల్లా మహిళ సాధికారత కేంద్రం ప్రతినిధి రోహిణి, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ప్రొటెక్షన్ ఆఫీసర్ శాంత, సోషల్ వర్కర్ రమేష్, సీడబ్ల్యూసీ శేఖర్, మహేష్, అంగన్వాడీ టీచర్లు, మహిళా గ్రూపు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో నరసింగరాణి సూచించారు. తాడిజర్రిలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. అర్హులైన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. గ్రామాల్లో లభించే మునగ, కరివేపాకు ప్రాముఖ్యత వివరించారు. మొబైల్ ఫోన్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, బాల్య వివాహాలు, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



చొప్పదండి: రుక్మాపూర్‌లోని మోడల్ స్కూల్‌లో ఆరో నుంచి పదో తరగతి వరకు మిగిలిన సీట్లకు ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు, తల్లిదండ్రులు నేరుగా ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు

చిగురుమామిడి: భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ ఎం రమేశ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బొమ్మనపల్లి రైతువేదికలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 182 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో తహసీల్దార్ రాణి ఆధ్వర్యంలో భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 105 మంది రైతులు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయబ్‌తహసీల్దార్ మన్విత్ సింగ్, ఆర్ఐ నాగరాజు పాల్గొన్నారు.

చొప్పదండి: గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మహేశ్వర్ కోరారు. మండలంలోని వెదురుగట్టు గ్రామంలో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అనంతరం ఆర్డీవో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్ కుమార్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్‌లో శుక్రవారం అధికారులు భూభారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో సమస్యలు పరిష్కారం చేయాలని 79 మంది రైతులు దరాఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరీ, డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్‌లో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ భూసమస్యలు పరిష్కారంపై మాట్లాడారు. భూసమస్యలపై 126 మంది రైతులు దరఖాస్తు సమర్పించారని తహసీల్దార్ తెలిపారు.

కరెంట్ షాక్‌తో యువకుడి మృతి


హరీశ్(ఫైల్)

తిమ్మాపూర్: మండల కేంద్రానికి చెందిన యువకుడు న్యాలం హరీశ్(35) శుక్రవారం కరెంట్‌షాక్‌తో మృతిచెందాడు. ఇంటి ముందున్న నీటిసంపు వద్ద కరెంట్ మోటార్ వైరు తగలడం వల్ల మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. హరీశ్‌కు భార్య దివ్య, కుమార్తె శ్రీహిత, కుమారుడు అక్షయ్ ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న హరీశ్ ఆకస్మిక మరణం కుటుంబం, గ్రామస్తులను శోకసముద్రంలో ముంచింది. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు అధికారులు సరైన భద్రతా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

జడ్జికి సన్మానం


జడ్జిని సన్మానిస్తున్న మంతెన వెంకటేశ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి గ్రామానికి చెందిన బత్తుల మానస జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మందెన వెంకటేశ్‌ను ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కృషి, పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవచ్చని, యువత మానసను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

ఎస్సైకి..


ఎస్సైని సన్మానిస్తున్న ఉదయ్, నాయకులు

గన్నేరువరం: గన్నేరువరం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నరేందర్‌రెడ్డి, ఏఎస్సై నుంచి ఎస్సైగా ప్రమోషన్ పొందిన రాధాకిషన్‌ను బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కుమార్, బీఆర్‌ఎస్ గన్నేరువరం మండల అధ్యక్షుడు గంప వెంకన్న, పలువురు నాయకులు శుక్రవారం కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బద్దం తిరుపతిరెడ్డి, గూడెల్లి ఆంజనేయులు,సుధాకర్, గొల్లపల్లి రవి, పురంశెట్టి బాలయ్య, అనిల్, రాజ్‌కుమార్, ప్రభాకర్, శంకర్, బాలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రి గడ్డం వివేక్‌ను కలిసిన సదికుమార్

చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా జీవీఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు, మండల కేంద్రానికి చెందిన మాశం సదికుమార్ రాష్ట్ర కార్మిక, మైనింగ్‌శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిగా శాఖలను సమర్థవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలిపారు. మండల, జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సదికుమార్ తెలిపారు. జీవీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఫౌండేషన్ రాష్ట్ర నాయకుడు లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి 'పొన్నం'కు కృతజ్ఞతలు

హుజూరాబాద్: కరీంనగర్ నుంచి తిరుపతికి వారానికి రెండుసార్లు రైలు నడిచేలా కృషి చేసిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎంపీగా పనిచేసిన పొన్నం ప్రభాకర్ జమ్మికుంట రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేశారని, ప్రస్తుత ఎంపీ బండి సంజయ్ రైల్వే స్టేషన్ మరికొన్ని ట్రైన్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏడుగురికి జరిమానా

చిగురుమామిడి: ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన మండలంలోని రామంచకు చెందిన ఏడుగురికి శుక్రవారం కరీంనగర్ ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ ఒక్కొక్కరికి ఎనిమిదివేల చొప్పున జరిమానా విధించారని చిగురుమామిడి ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు. జరిమానాతో పాటు ఒక్కొక్కరు రెండేసి మొక్కలు నాటాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

పరామర్శ


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

చిగురుమామిడి: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచినవారే అసలైన నాయకులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని రేకొండ మాజీ ఎంపీటీసీ చాడ శోభ కుటుంబాన్ని శుక్రవారం సాయంత్రం సీపీఐ జాతీయనేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. సీపీఐ నేత, మాజీ ఎంపీపీ చాడ ప్రభాకర్‌రెడ్డి ప్రజల కోసమే పనిచేశారని, శోభ, ప్రభాకర్ రెడ్డి ఆశయసాధనకు కార్యకర్తలు కృషిచేయాలని కోరారు. వెంట పార్టీ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేదారి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోయిని పటేల్, బూడిద సదాశివ, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, తేరాల సత్యనారాయణ, కసిరెడ్డి మణికంఠరెడ్డి, పైడిపెల్లి రాజు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలని, ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డాక్టర్ ఎంవీ సతీశ్‌కుమార్, యోగేశ్ పుండలిక్, అధ్యాపకులు ఉన్నారు.

క్రీడా పాఠశాలల్లో చేరేందుకు ఎంపిక పోటీలు



చిగురుమామిడి: మండల కేంద్రంలోని క్రీడా పాఠశాలల్లో చేరేందుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి పావని శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 2025–26వ సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మూడు అంచెల్లో పోటీలుంటాయన్నారు. మండల స్థాయి పోటీలు 18న చిగురుమామిడి జెడ్పీపాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నామని, ఎంపికైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో 23 నుంచి మూడు రోజుల పాటు ఎంపిక పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పోటీలు జూలై 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహిస్తారని, అర్హులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గన్నేరువరం: క్రీడా పాఠశాలలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి రామయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమ తెలిపారు. కరీంనగర్, ఆదిలాబాద్, హకీంపేట స్పోర్ట్స్ స్కూళ్లలో చేరికకు మూడు అంచెల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. 01/09/2016 నుంచి 30/08/2017 మధ్య జన్మించినవారు అర్హులని, 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9494724946, 9440068866 నంబర్లు సంప్రదించాలని కోరారు.

రామడుగు: అర్హులైన విద్యార్థులు 15వ తేదీలోపు దరాఖస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ ప్రకటనలో కోరారు. వివరాలకు మండల కన్వీనర్ పీడీ దత్తాత్రి 9849976087 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శంకరపట్నం: మండల స్థాయి క్రీడాపోటీలను 17న కేశవపట్నం క్రీడామైదానంలో నిర్వహించనున్నామని ఎంఈవో లక్ష్మీనారాయణ ప్రకటనలో తెలి పారు. వివరాలకు కన్వీనర్ శ్రీనివాస్‌ను 9848738704 నంబర్ సంప్రదించాలని సూచించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


జమ్మికుంట: పరీక్షలు చేస్తున్న వైద్యులు


చొప్పదండి: వైద్య శిబిరంలో మహిళలు

జమ్మికుంట: మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. చందు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో మహిళా పారిశుధ్య కార్మికులు, మెప్మా సంఘం సభ్యులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, మెప్మా జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీవాణి, డాక్టర్లు చందన, హిమబిందు, మహోన్నత పటేల్, కంటి వైద్యులు జలధర్, మేనేజర్ రాజిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సదానందం, హెల్త్ సూపర్‌వైజర్స్ రచన, అరుణ, సీఎల్ఆర్పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పట్టణంలోని స్వశక్తి మహిళలకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కీర్తన ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజు పాల్గొని మాట్లాడారు. ఉచిత శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రశాంత్ కుమార్, హెల్త్ ఆఫీసర్ వెంకటస్వామి, శివాని, అనిత, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమష్టిగా కష్టపడితేనే అభివృద్ధి

రామడుగు: రైతులు సమష్టిగా కష్టపడి పని చేస్తేనే తిర్మలాపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ మరింత అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందని మండల వ్యవసాయాధికారి త్రివేదిక తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం తిర్మలాపూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వార్షిక సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు గంట్ల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఏవో త్రివేదిక మాట్లాడుతూ.. రైతులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే దేశం కూడా ఆరోగ్యంగా ఉంటుందని, ప్రకృతి సాగు వైపు రైతులు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రగతి నివేదికను సీఈవో రాజు నివేదించారు. సమావేశంలో డైరెక్టర్లు మన్నె కిషన్‌చందర్, పొన్నం సత్యనారాయణ, కట్ల మోహన్‌రెడ్డి, పొన్న లక్ష్మి, ఎలగందుల శ్రీనివాస్, గోపు శ్రీనివాస్‌రెడ్డి, మాడిశెట్టి అనిల్, రాజమల్లు, గంగాధర్ పలు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న మాజీ ఎంపీపీ హరీశ్

రామడుగు: మండలంలోని వన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగి గాజుల శ్రీనివాస్ రూ.పదివేలు విలువ చేసే నోట్ బుక్స్‌ను అందజేయగ మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీచర్లు, మాజీ ఉపసర్పంచ్ ఓంప్రకాశ్, నాయకులు శ్రీనివాస్, పొన్నాల అజయ్, రవీందర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేదికపై జ్యోతిష్మతి విద్యార్థుల పరిశోధనా పత్రం

తిమ్మాపూర్: మండలంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ఈసీఈ విభాగానికి చెందిన నాలుగో సంవత్సరం విద్యార్థులు శరణ్య గజ్జల, శ్రీలేఖ కుచన, నమ్రత బెల్లం, శ్రీజ చింతకింది రచించిన 'పైథాన్ ప్రోగ్రామింగ్ ఫర్ ఎఫీషియంట్ బ్రీథోమిక్స్ ఇమేజ్ ప్రాసెసింగ్ అండ్ అనాలిసిస్' అనే పరిశోధనా పత్రం కెనడాలోని అల్బెర్టాలో 2025 ఆగస్టు 18–22 తేదీల్లో జరిగే ఐట్రిపుల్‌ఈ స్మార్ట్ వరల్డ్ కాంగ్రెస్‌లో ప్రదర్శన, ప్రచురణ కోసం రెగ్యులర్ పేపర్‌గా ఎంపికైంది. విషయాన్ని ఐట్రిపుల్‌ఈ ఎస్‌డబ్ల్యూసీ కమిటీ ఇమెయిల్ ద్వారా తెలియజేసింది. పరిశోధనా పత్రం పైథాన్ ప్రోగ్రామింగ్ ఆధారంగా బ్రీథోమిక్స్ ఇమేజ్ ప్రాసెసింగ్, విశ్లేషణలో సమర్థవంతమైన పద్ధతులను అన్వేషిస్తుంది. పత్రం జ్యోతిష్మతి ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ డి. రవి కిరణ్ బాబు పర్యవేక్షణలో రూపొందించారని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. పరిశోధనకు అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, భారత ప్రభుత్వం నుండి ఆర్థిక సహకారం లభించింది. ఈ విజయంపై కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి విద్యార్థి బృందాన్ని, పర్యవేక్షకులను అభినందించారు. 'ఈ పరిశోధనా పత్రం అంతర్జాతీయ వేదికపై ఎంపిక కావడం మా కళాశాలకు గర్వకారణం అన్నారు. ఎన్ఆర్ఎఫ్, డీఎస్టీ నుంచి ఆర్థిక సహకారం విజయాన్ని మరింత ప్రతిష్టాత్మకం చేసింది'అని చైర్మన్ సాగర్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. అకాడమిక్ డీన్ డాక్టర్ పీకే వైశాలి, విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఐట్రిపుల్‌ఈ స్మార్ట్ వరల్డ్ కాంగ్రెస్ సాంకేతిక రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ సదస్సుల్లో ఒకటి. సదస్సు స్మార్ట్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇమేజ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో కొత్త ఆవిష్కరణలను ప్రదర్శించే వేదికగా గుర్తింపు పొందింది. జ్యోతిష్మతి విద్యార్థుల పరిశోధనా పత్రం సదస్సులో ప్రదర్శనకు ఎంపిక కావడం సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణ సామర్థ్యాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. పైథాన్ ప్రోగ్రామింగ్‌ను ఉపయోగించి బ్రీథోమిక్స్ ఇమేజ్ ప్రాసెసింగ్‌లో సమర్థవంతమైన పద్ధతులను విద్యార్థులు అభివృద్ధి చేశారు. పరిశోధనతో వైద్య రంగంలో శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నిర్ధారణ, చికిత్సలో కీలకమైన ఇమేజ్ విశ్లేషణను మెరుగుపరిచే అవకాశం ఉంది. విద్యార్థుల విజయం వారి కఠిన శ్రమ, సాంకేతిక నైపుణ్యం, పరిశోధనా నిబద్ధతకు నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ క్లబ్‌లో సభ్యుల ఆరోగ్య పరీక్షల కోసం వెల్‌నెస్ సెంటర్‌ను కలెక్టర్, క్లబ్ చైర్‌పర్సన్ పమేలా సత్పతి శుక్రవారం ప్రారంభించారు. పలువురు సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కరీంనగర్ క్లబ్ సభ్యులు వెల్‌నెస్ సెంటర్ సేవలను ఉపయోగించుకోవాలని సూచించా రు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం క్లబ్‌లో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. కరీంనగర్ క్లబ్ కార్యదర్శి వెంకట్, సంయుక్త కార్యదర్శి మనోహర్ రావు, కోశాధికారి రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.